క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలో అరుగుంటపల్లి గ్రామం వద్ద భద్రాచలం, వాజేడు రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు గురువారం వాహన తనిఖీలను నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు.

వెంకటాపురం(కె)లో..



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయటంతో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి వదిలేశారు.

పారిశుద్ధ్య పనులు



వాజేడు: మండల కేంద్రంలో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలతో పాటు గ్రామంలోని వీధులకు రెండు వైపుల బ్లీచింగ్ చల్లారు.

ఫ్రీజర్ వితరణ



గోవిందరావుపేట: గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎలమకొండ మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారులు గ్రామ పంచాయతీకి బాడి ఫ్రీజర్‌ను బహూకరించారు. ఈ మేరకు గురువారం సర్పంచ్ రాముకు మోహన్‌రెడ్డి కుమారులు కృష్ణారెడ్డి, రవి రూ.90 వేల విలువగల శవ పేటికను అందజేశారు. గోవిందరావుపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో మృతుల కుటుంబాలకు వినియోగంగా ఉంచాలని అన్నారు. కార్యదర్శి శరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మేరుగు సమ్మయ్య అనే వ్యక్తి వద్ద గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మేరుగు సమ్మయ్య అతడి చికెన్ సెంటర్‌లో అక్రమంగా గుడంబాను అమ్ముతున్నాడనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టగా ఐదు లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. ఈ మేరకు గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేయగా రెండు ఇళ్లలో గుడుంబా లభించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లికి చెందిన వెంకటరాజం ఇంటి వద్ద 8 లీటర్లు, మినుగు కేశవ్ ఇంటి నుండి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోని వారిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన దివ్యాంగులు

భూపాలపల్లి రూరల్: హైదరాబాదులోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర దివ్యాంగుల కార్పోరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి భారత జాగృతి దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కుమార స్వామి గౌడ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని 50 మంది దివ్యాంగులు తరలి వెళ్లారు. జిల్లాలోని దివ్యాంగులు జిట్టబోయిన ప్రశాంత్, ముదురుకోళ్ల నర్సయ్య సతీష్, యం. ప్రభాకర్, శంకర్, పి.చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

నియామకం

మహదేవపూర్: మండలంలోని రాపల్లికోట బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులను మండల అధ్యక్షుడు లింగాంపల్లి శ్రీనివాసరావు గురువారం నియమించారు. అధ్యక్షుడిగా పంచిక వెంకటస్వామి, మహిళా అధ్యక్షురాలిగా తోట మల్లక్కను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిబాపు, మనోహర్, రాకేష్ ఉన్నారు.

కాల్వల్లో పూడిక

- పొట్ట దశలో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు
- సొంత డబ్బులతో మరమ్మతులు

గోవిందరావుపేట: గోవిందరావుపేట మండలం చల్వాయి శివారులోని గౌరారం చెరువుపై ఆధారపడి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో పంట కాలువలు పూడికతో కూరుకుపోయి నీరు పొలాలకు అందడంలేదు. చెరువలో సరిపడా నీరు ఉన్న పంటలు ఎండిపోతున్నయనే ఆవేదనలో రైతులు సతమతమవుతున్నారు. వర్షాకాలం సీజనల్ కురిసిన అధిక వర్షాలకు కాలువలు గండ్లు పడడం ప్రధాన సమస్యగా మారింది. సమస్యపై సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితంలేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

పొట్టదశలో పంటలు

రైతులు ఆరుకాలం కష్టపడి సాగు చేసిన వరి పంట పొట్టదశలో ఉంది. రైతులు పంట సాగుకు పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తుందనే ఆలోచనలో ఉన్న క్రమంలో నీరు అందడంలేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చివరి దశలో పంటకు నీరు అందకపోతే రైతులు ఆశించిన రీతిలో దిగుబడి రాదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళనకు గురవుతున్నారు.



పూడికపోయిన గౌరారం చెరువు కాల్వ

మరమ్మతులు చేపడుతున్న రైతులు

చల్వాయి శివారు గౌరారం చెరువు పారకంలో సుమారు 150 ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాల్వలు కోతకు గురికావడంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందడం కష్టంగా మారింది. దీంతో రైతులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడంతో చేసేది ఏమిలేక సొంత ఖర్చులతో పంటలను కాపాడుకునేందుకు కాలువల మరమ్మతులను చేపట్టారు.

మరమ్మతులు చేపట్టాలి



పంటలను చెరువులపై ఆధారపడి సాగు చేసుకుంటున్న క్రమంలో కాలువలను ప్రభుత్వం ప్రతిఏటా మరమ్మతులు చేపట్టాలి. అధిక వర్షాల కారణంగా కాలువలకు గండ్లుపడితే పటించుకునే వారు కరువయ్యారు. ఆయకట్టు రైతులు పంటలను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నాము. ప్రభుత్వం ప్రత్యేక చొరువతో కాలువల మరమ్మతులు చేపట్టాలి.

–పొన్నం సాయి, ఆయకట్టు రైతు, చల్వాయి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం(కె): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామంలో కుడుముల సమ్మక్క అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్మికుల మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించే అంశాన్ని అన్ని రాజాకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని అన్నారు. కార్మికుల పోరాటాలకు సీపీఐ పార్టీ అన్నివేళలా మద్దతుగా ఉంటుందని అన్నారు. వంట కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల రాజు, సరోజిని, రాంబాబు, భద్రమ్మ, అమ్మాజి, రాదమ్మ, పెంటమ్మ ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

టేకుమట్ల: తన జెండా, ఎజెండా ఒక్కటేనని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎంచుకుని పని చేస్తానని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సోమనపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతం నుంచి తన కుటుంబ సభ్యులు సైతం బీజేపీలోనే ఉన్నారని, ఏనాడూ పార్టీ జెండాను వదలేదన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎవరు ఏ జెండా మోశారో, ఇప్పుడు ఏ జెండా మోస్తున్నారో ప్రజలు గమణించాలన్నారు. జెండాలు మార్చే వారితో అభివృద్ధి శూన్యమని అన్నారు. బీజేపీ అభ్యర్థినైన తనను ఓట్లతో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని మహితాపురం, కత్రవానిగుంపు, దానవాయిపేట, శివాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమ తెరల వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

వెంకటాపురం(ఎం): మండలంలోని గంపోనిపల్లె, వెంగళాపూర్ గ్రామాల్లో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో 176 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌బాబు, సీఓలు స్వరూప, రామకృష్ణ, రాంబాబు, హెచ్‌ఓ తిరుమల ఆర్‌డీటి సిబ్బంది పాల్గొన్నారు.



గంపోనిపల్లెలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అక్రమ రవాణా నిర్మూలనపై శిక్షణ

ఎస్ఎస్‌తాడ్వాయి: మనుషుల అక్రమ రవాణా నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రజ్వల సంస్థ సీనియర్ కోఆర్డీనేటర్ చంద్రయ్య అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, మహిళా శిశు సంక్షేమశాఖ, తాడ్వాయి ప్రాజెక్ట్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మనుషుల అక్రమ రవాణా నిర్మూలనపై అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ చంద్ర మాట్లాడుతూ.. ఐపీసీ, ఐటీపీఏ, పాక్స్ సోయాక్ట్ లోని సెక్షన్లు, బాల్య వివాహ చట్టాలపై వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సహాయం కోసం 1098, 181, 100, 1930 ఉపయోగంపై అంగన్‌వాడీ టీచర్లను ఐదు గ్రూప్‌లుగా చేసి అంశాలపై రోల్ ప్లే, గ్రూప్ వర్క్‌ల ద్వారా శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. తొలి రోజు ప్రీ పరీక్ష, ముగింపు రోజు పోస్ట్ పరీక్ష నిర్వహించి వారి ఇంప్రూవ్ మెంట్ ప్రజెంట్ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావ్య ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ ప్రేమలత, సీడీపీఓ మల్లిశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు

క్రీడా స్ఫూర్తిని చాటాలి

ములుగు: క్రీడకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు రియాజ్ మీర్జా అన్నారు. జిల్లా కేంద్రంలో క్రికెట్ క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతి తరుపున పట్టణంలోని పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొర్రె సమ్మయ్య, కాకి పురుషోత్తం, బైకాని సాగర్, శ్రీను, నాజర్ ఖాన్, లక్ష్మీ, రాధా, శ్రీను, నాజర్‌ఖాన్, కోగిల మహేష్, యూనిస్, గరిగె రఘు, నగేష్, లింగమూర్తి, పోగుల మహేందర్, రమేష్, అరుణ్, నవీన్, కొత్తకొండ రవి, మాదం సాగర్, రమేష్, దేవర రాజు, సంతోష్, కోళ్ల వెంకన్న పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రియాజ్ మీర్జా

పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో వైద్య సిబ్బంది

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి చిన్నపాక యమున ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాలతో కలిసి బతుకమ్మను పేర్చి పీహెచ్‌సీ ఆవరణలో ఆడుతూ పాటలు సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శైలజ, ఏఎన్ఎం సారమ్మ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



ఏటూరునాగారం: ముత్యాలమ్మ చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: రామాలయంలో..

మంగపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో పూజారి విస్సావఝ్జల నరేష్‌శర్మ అమ్మవారిని గురువారం లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రాజుపేట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, రమణక్కపేటలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. రాజుపేట రావిచెట్టు సెంటర్లో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. తిమ్మంపేట, కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, చెరుపల్లి తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా పూజలు నిర్వహించారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు 5వ రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో దుర్గామాత అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దుర్గామాత అమ్మవారిని రూ.4,11,116 కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకాంభరిదేగా దుర్గామాత

మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్టార్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని నిర్వాహకులు, భవాని మలాధారులు శాకాంభరీదేవిగా అలంకరించారు. వివిధ రకాలు కూరగాయలతో అమ్మవారిని అలంకరించి, అర్చకులు రాధకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, మహిళలు 108 రకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు. అలాగే ముత్యాలమ్మ వద్ద లక్ష్మీదేవత అవతారంలో కరెన్సీ నోట్లతో అలంకరించారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్: మండల కేంద్రంలోని శివాజీచౌక్ వద్ద దుర్గ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం దుర్గమాత స్కందమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు హోమం నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాడిజ రామకృష్ణ, కారేంగుల శ్రీధర్‌రావు, పురోహితుడు శివ శర్మ, భక్తులు పాల్గొన్నారు.



రాజుపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో..



రావిచెట్టు సెంటర్‌లో లలితాదేవి అలంకరణలో..

సంప్రదాయాలను కాపాడుకోవాలి



మల్లూర్: గోధుమ బుట్ట ఎత్తుకుంటున్న మధు

మల్లూర్: ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్టమధు అన్నారు. గిరిజనుల సంస్కృతిక పండుగ తీజ్ ఉత్సవాలను మల్లూర్ మండలంలో దుబ్బపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పుట్ట మధు పాల్గొని మహిళలతో కలిసి ఆడి పాడారు. ఈ సందర్భంగా గోధుమ బుట్టలు నెత్తిన పెట్టుకోని గిరిజనుల నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాదిస్తూ జరుపుకునే తీజ్ ఉత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు జక్కు రాకేష్ సర్పంచ్ ప్రమీల రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్‌భండారో..

మహాముత్తారం: లంబాడీల ఆరాధ్య దైవమైన భోగ్ భండారో జాతరను లంబాడీలు ప్రతీ సంవత్సరం దసరా ముందు వచ్చే గురువారం జరుపుకుంటారు. అందులో భాగంగా మండలంలోని బోర్లగూడెం గ్రామంలోగల దేవునితండాలోని బాలాజీ ఆలయం వద్ద లంబాడీలు భోగ్‌బండారో జాతరను ఘనంగా నిర్వహించారు. మండలంలోని బోర్లగూడెం, పెగడపల్లి, స్తంబంపల్లి(పీకే), ప్రేమ్‌నగర్, చింతలపల్లి తదితర గ్రామాల నుంచి లంబాడీలు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న సంధ్య

గోవిందరావుపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ సంధ్య అన్నారు. గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళ సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని అన్నారు. ధరణి పోర్టల్ రద్దు చేసి రైతులకు హక్కు పత్రాలను అందించడంతో పాటు పోడు రైతులకు , అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందించి ఇందిరమ్మ రైతు భరోసా పథకం అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజన, మండల అధ్యక్షురాలు నాగమణి, సూదిరెడ్డి జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కొడిశాల పీహెచ్‌సీలో ఆశ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న చాప నాగమణి భర్త బుచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి కొడిశాల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది చేయుతనిచ్చారు. డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ క్రాంతికుమారులు గురువారం పరామర్శించి వైద్యాధికారులు, సిబ్బంది సమాకూర్చిన రూ.51,516లను నగదు నాగమణికి ఆర్థిక సాయంగా అందజేశారు. నగదును వారి కుమార్తె ప్రియదర్శిణి పేరు మీద ఫిక్స్‌డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ.. వైద్య సిబ్బందికి అండగా ఉంటామన్నారు. ఆర్థిక సాయం అందించిన సహకరించిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పవన్, ఫార్మాసిస్టు స్వామి, హెల్త్ అసిస్టెంట్ సీతారం, ఏఎనం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న అప్పయ్య

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మొగుళ్లపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరహరి బక్కిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కేతిపెల్లి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంద స్వామి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పంచమనేని రవీందర్రావు, పిన్నింటి సాంబశివరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లకొండ కొమురయ్య, రవి, తదితరులు ఉన్నారు.